


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





నరసాపురం-మచిలీపట్నం రైల్వే లైన్

లూప్‌లైన్‌లోకి వెళ్లిందా..?

నరసాపురం, మే 17(ఆంధ్రజ్యోతి):నరసాపురం నుంచి మచిలీపట్నం వరకు కొత్త రైల్వేలైన్ ప్రతిపాదన బ్రిటిష్ కాలం నాటిది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ఈ రైల్వేలైన్‌పై దృష్టి సారించారు. కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ పను లు చివరి దశకు చేరుకోవడంతో నరసాపురం-మచిలీ పట్నం రైల్వేలైన్ పట్టాలెక్కిస్తామని ప్రకటించారు. దీంతో ఈ ప్రాజెక్టుపై జిల్లావాసుల్లో ఆశలు చిగురించాయి. దీనికి అనుగుణంగానే యుద్ధప్రతిపాదికన సర్వే చేయించారు. 78 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ కొత్త రైల్వేలైన్‌కు ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ప్రజలు ఎదురుచూశారు. అయితే ఐదు నెలలు గడిచినా.. ఇంత వరకు ఆ ఊసేలేదు. ఈ ఏడాది ఈ ప్రాజెక్టుకు రెడ్‌సిగ్నల్ పడి లూప్‌లైన్‌లోకి వెళ్లిపోయిందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కోటిపల్లి నుంచి నరసాపురం వరకు రైల్వేలైన్ నిర్మించడం వల్ల తీర ప్రాంత గ్రామాల్లో రైలుకూత వినిపించనుంది. నరసాపురం నుంచి మచిలీపట్నం వరకు ఈ రైలును పొడిగిస్తే మొగల్తూరు, కృష్ణా జిల్లా కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల మీదుగా మచిలీపట్నం వరకు రైలు మార్గం ఏర్పడుతుంది. వంతెనలు పెద్దగా లేకపోవడంతో భారీ వ్యయం ఉండదు. దీంతో ఈ ప్రాజెక్టుకు కేంద్రం నిధులు కేటాయిస్తుందని ఎదురు చూసినప్పటికి ఇంత వరకు ఆ ఊసేలేదు. నేతలు, రైల్వే అధికారులు కేటాయింపులపై నోరు మెదపడం లేదు. దీనిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వ్యవసాయ యాంత్రిక పనిముట్లకు సబ్సిడీ

రూ.7.2 కోట్లు

భీమవరం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): రైతులకు చేయూతనిచ్చేలా యాంత్రిక పనిముట్ల సబ్సిడీని కూటమి ప్రభుత్వం తిరిగి అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు జిల్లాకు సబ్సిడీ సొమ్మును రూ.7.2 కోట్లు విడుదల చేసింది. ఇందులో వరి సాగులో పురుగు మందులు పిచికారి చేసేందుకు అవసరమైన డ్రోన్ పరికరాల కొనుగోలుపై సబ్సిడీ నిమిత్తం రూ.3.2 కోట్లు ఇస్తారు. ఒక డ్రోన్ ధర 10 లక్షలు. ఇందులో రెండు లక్షలు రుణం, ఎనిమిది లక్షలు సబ్సిడీ. ఈ రుణాన్ని నెలవారీ వాయిదాల పద్ధతిలో బ్యాంకులకు జమ చేయాలి. ఒక్కో డ్రోన్‌ను పది మంది సభ్యులుగల గ్రూపునకు ఇస్తారు. ఇలా జిల్లాలో 400 మంది 40 గ్రూపులుగా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటు న్నారు. మిగిలిన మొత్తంలో చిన్న ట్రాక్టర్లు, ఇతర పరికరాలు ఉన్నాయి. చిన్న ట్రాక్టర్ ధర రెండు లక్షల 29 వేలు కాగా, ఇందులో లక్ష రూపాయలు సబ్సిడీ కాగా, మిగిలిన లక్ష 29 వేల రూపాయలు రైతు చెల్లించాలి.

సిందూర్ సక్సెస్‌పై బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు తదితరులు

భీమవరం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద చర్యలకు ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ చేసిన ఆపరేషన్ సిందూర్ దాడులు విజయవంతమయ్యాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శనివారం భీమవరంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో తిరంగా బైక్ ర్యాలీని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా తిరంగా యాత్రలో వేలాది మంది పౌరులు పాల్గొన్నారన్నారు. పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పాకిస్థాన్ దురాగతాలను అరికట్టడానికి భారతదేశం కృతనిశ్చయంతో ఉంటుందని, ప్రపంచ దేశాలకు భారత దేశం ఆదర్శమని అన్నారు. ర్యాలీలో రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ళ నాగేశ్వరరావు, మునిసిపల్ మాజీ చైర్మన్లు కొటికలపూడి గోవిందరావు, మెరగాని నారాయణమ్మ, టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

టార్గెట్ రూ.175 కోట్లు

- మే నెలలో మద్యం అమ్మకాల లక్ష్యం
- ఈ నెలలో లైసెన్స్ ఫీజు, సరుకు కొనుగోలుకు లైసెన్స్‌దారుల ఆపసోపాలు
- అమ్మినా, అమ్మకపోయినా మద్యం కొనాల్సిందే.. ఎక్సైజ్ ఆదేశాలు
- ఇప్పటికే నెలకు రూ.120 కోట్ల విక్రయాలు.. ఇప్పుడు మరో రూ.55 కోట్లు పెంచాలి



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ప్రైవేటు మద్యం పాలసీలో లైసెన్స్‌దారులకు ఎక్సైజ్ శాఖ లక్ష్యాలను నిర్దేశిస్తోంది. ఈ నెలలో జిల్లాలో రూ.175 కోట్ల అమ్మకాలు సాగించాలని స్పష్టం చేసింది. మద్యం షాపులు, బార్ లైసెన్స్ దారులు ఈ నెల 31 నాటికి లక్ష్యాన్ని పూర్తి చేయాలి. ఇదే నెలలో లైసెన్స్ రుసుము చెల్లించాలి. ఒకేసారి రెండు దెబ్బలు. అప్పుల కోసం లైసెన్స్‌దారులు పరుగులు పెడుతున్నారు. గతంలో మద్యం షాపు యజమానులంటే మార్కెట్‌లో అప్పు పుట్టేది. ఇప్పుడు మార్కెట్‌లో అప్పు దొరకడం లేదు. లక్ష్యానికి మించి మద్యం కేసులు కొనుగోలు చేయాల్సి రావడంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. జిల్లాలో ప్రతి నెలా రూ.120 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. గతంలో అమ్మకాలు సాగించిన నాసిరకం మద్యానికి స్వస్తి పలికారు. బ్రాండెడ్ రకాలే అందుబాటులోకి వచ్చాయి. అక్రమమార్గంలో దిగుమతి చేసి విక్రయించే విధానానికి చెక్ పడింది. బ్రాండెడ్ రకాల పేరుతో తయారు చేస్తూ జిల్లాకు దిగుమతి చేస్తున్న నకిలీ మద్యం రాకెట్‌ను ఎక్సైజ్ శాఖ కుప్పకూల్చింది. నిందితులను అరెస్ట్ చేశారు. ఇలా ఎక్కడికక్కడ కట్టడి చేయడంతో జిల్లాలో మద్యం అమ్మకాలు పెరిగాయి. గతంలో రూ.3 కోట్లు టర్నోవర్ సాధించేవారు. ఇప్పుడది రూ.4 కోట్లకు చేరింది. నెలకు రూ.120 కోట్ల మేర అమ్మకాలు సాగిస్తున్నారు. అయితే మేలో రూ.175 కోట్లు లక్ష్యాన్ని సాధించాలని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీచేశారు. దీంతో లైసెన్స్‌దారులు మల్లగుల్లాలు పడుతున్నారు. లక్ష్యానికి మించి కొనుగోలు చేసేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

బార్‌ల కొత్త ఎత్తుగడ

మద్యం షాపుల్లో నాణ్యమైన బ్రాండ్‌లు లభ్యం కావడంతో బార్‌లలో వినియోగం పడిపోయింది. అధిక ధరలకు బార్‌లలో మద్యం విక్రయిస్తారు. కానీ మద్యం షాపుల్లో ఎంఆర్‌పీ ధరకంటే తక్కువకు సరఫరా చేస్తుండడంతో బార్‌ల వైపు ఎవరూ పెద్దగా చూడడం లేదు. వైసీపీ హయాంలో ప్రభుత్వషాపుల్లో నాసిరకం ఉండేది. బార్‌లలోనే బ్రాండ్‌లు దొరికేవి. దాంతో మద్యపానప్రియులు బార్‌లకు ఎగబడేవారు. అప్పట్లో బార్‌ల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఉండేది. ప్రస్తుతం ప్రైవేటు షాపుల్లోనూ బ్రాండెడ్ రకాలు దొరకుతున్నాయి. పైగా తక్కువ ధరకే లభ్యమవుతోంది. దాంతో బార్‌లలో అమ్మకాలు పడిపోయాయి. భీమవరం, తాడేపల్లిగూడెంలో రెండు షాపుల్లో ప్రతిరోజు రూ.2 లక్షలకు పైగా అమ్మకాలు సాగించేవారు. ప్రైవేటు మద్యం షాపులు వచ్చిన తర్వాత అమ్మకాలు రూ.15 వేలకు పడిపోయాయి. దీంతో అక్కడ ఎంఆర్‌పీ ధరలకే అమ్మకాలు సాగించే ఎత్తుగడ వేశారు. ఫలితంగా రోజుకు లక్ష రూపాయల వంతున బార్‌లలోనూ అమ్మకాలు సాగిస్తున్నారు. ఇలాంటి ఎత్తుగడలు వేసుకుంటూ బార్‌లు నిర్వహిస్తున్నారు. అయినా నష్టాల బాటలోనే నడుస్తున్నాయి. ఈ తరుణంలో లక్ష్యాలు ఇవ్వడంతో బార్‌ల యజమానులు సైతం దిక్కులు చూస్తున్నారు.

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్

- భీమవరం, తాడేపల్లిగూడెం, ఏలూరుల్లో ఐదు కేంద్రాలు
- ఉదయం, మధ్యాహ్నం.. రెండు సెషన్స్‌లో ఆన్‌లైన్ పరీక్ష



భీమవరం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా వున్న 23 ఐఐటీల్లోని ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం జరిగే జేఈఈ అడ్వాన్స్‌కు పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 136 మంది, తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో 240, శశి ఇంజనీరింగ్ కళాశాలలో 200, ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 180 మంది, సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్‌ఈ స్కూలు కేంద్రానికి 144 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి షిఫ్టులో పేపర్-1, మధ్యా హ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఐదున్నర వరకు రెండో షిఫ్టులో పేపర్-2 పరీక్ష జరుగుతుంది. ఉదయం ఎనిమిదిన్నరలోపు, మధ్యాహ్నం రెండు గంటల్లోపు విద్యార్థులు హాజరుకావాలి. పరీక్షకు అరగంట ముందే గేట్లు క్లోజ్ చేస్తారు. అడ్మిట్ కార్డుతోపాటు వాలిడ్ ఒరిజినల్ ఫోటో గుర్తింపు (ఆధార్/ఓటరు ఐడీ/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్టు/పాన్‌కార్డు/ కళాశాల ప్రిన్సిపాల్ జారీచేసిన ఐడీ/నోటరైజ్ సర్టిఫికెట్) ధ్రువపత్రాన్ని తప్పనిసరిగా తీసుకెళ్లాలి. పెన్ లేదా పెన్సిల్‌తోపాటు పారదర్శకంగావున్న వాటర్‌బాటిల్‌ను అభ్యర్థులు తమ వెంట తీసుకెళ్లేందుకు అనుమతిస్తారు. అభ్యర్థులు సాధారణ ఫార్మల్ దుస్తులను మాత్రమే ధరించాలి.

రేపటి నుంచి ఈఏపీ సెట్

జిల్లాలో ఏడు పరీక్ష కేంద్రాలు.. గంటన్నర ముందుగానే అనుమతి.. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లు

భీమవరం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి):ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్ష ఏపీఈఏపీ సెట్ ఈ నెల 19వ తేదీ సోమవారం నుంచి 27వతేదీ వరకు జరగనుంది. 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ, 21, 22, 23, 24, 26, 27 తేదీల్లో ఇంజనీరింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం ప్రాంతాల్లోని ఏడు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్నారు. భీమవరం డీఎన్నార్, ఎస్ఆర్‌కేఆర్, విష్ణు, తాడేపల్లిగూడెం శశి, వాసవి, నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా పరీక్షలు జరుగుతాయి. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పరీక్ష జరుగుతాయి. విద్యార్థులను గంటన్నర ముందుగానే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. విద్యార్థులు హాల్ టిక్కెట్ తప్పనిసరిగా తీసుకురావాలి.

దంచికొట్టిన వాన



తాడేపల్లిగూడెం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి):పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల కరెంటు సరఫరాను నిలుపుదల చేశారు. ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించింది. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో గంటన్నరపాటు వర్షంతోపాటు గాలి దుమారం రేగడంతో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఇటు కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. వ్యాపారాలు నిలిచిపోయాయి.

- మొగల్తూరులో మామిడి విక్రయాలకు ఏదీ ప్రోత్సాహం
- ఏటా వేలాది టన్నుల దిగుబడి.. రూ.కోట్లలో వ్యాపారం
- సరైన మార్కెట్ లేక రహదారుల పైనే విక్రయాలు
- రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారుల ఇబ్బందులు
- గోదాముల సౌకర్యం లేక ఏటా భారీ నష్టాలు
- సాగుపై అవగాహన కల్పించని హార్టికల్చర్ అధికారులు



రోడ్డే మార్కెట్ !

మొగల్తూరు, మే 17(ఆంధ్రజ్యోతి):తెలుగు రాష్ట్రాల్లోనే పేరుగాంచిన మొగల్తూరు మామిడి ఫలసాయం క్రయ విక్రయాలకు పండ్లు ముగ్గబెట్టేందుకు ప్రభుత్వం నుంచి కనీస సదుపాయాలు కానరావడం లేదు. తీర ప్రాంతమైన మొగల్తూరు మండలంలోని ఇసుక నేలల్లో తేమ గల వాతావరణం ఉండటంతో మామిడి సాగుకు ఇది అనుకూలం. దీంతో మొగల్తూరు మండలంలోని 1,200 ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించాయి. వీటితోపాటు ఇంటి పెరటిలోనూ, ఖాళీ స్థలాల్లోనూ ఇక్కడి ప్రజలు చెట్లు పెంచుతారు. బంగినపల్లి, చెరుకు రసం, సువర్ణరేఖ, ఇమామ్ పసంద్, పంచదార రసాలు, నీలకంఠాలు, చిన్న రసాలు, పెద్ద రసాలు ఇలా పండ్ల రకాలతోపాటు కొత్తపల్లి కొబ్బరి, దేశవాళి, హైజార్లు, జొన్నలరాశి వంటి రకాల పచ్చడి మామిడి ఇక్కడ తోటల్లో దిగుబడికి వస్తున్నాయి. రైతులు, కౌలు రైతులు, మామిడి పండ్లను విక్రయిస్తూ తీరంలో వేలాది కుటుంబాలు ఈ సాగు ఫల సాయంపై ఆధారపడి ఉన్నాయి.

క్రయ విక్రయాలకు సదుపాయాలేవీ

వేల మెట్రిక్ టన్నుల్లో దిగుబడికి వచ్చే మొగల్తూరులోని వివిధ రకాల మామిడి పండ్ల క్రయ, విక్రయాలకు సరైన మార్కెటింగ్ సదుపాయం లేదు. పాటదారులు మొగల్తూరు మార్కెట్‌లో కనీస సదుపాయాలు లేకపోవడంతో పాతకాలువ సెంటర్ వై.జంక్షన్‌లోని పూర్వపు ఆర్అండ్‌బీ రోడ్డు మీదనే వేలం పాటలు పెట్టి విక్రయిస్తున్నారు. మొగల్తూరు మామిడి పండ్లు నేరుగా కొనుగోలు చేసుకునేందుకు మామిడి పండ్ల ప్రియులు ప్రత్యేకంగా వేలం పాటపెట్టే సమయం ఉదయం ఆరు గంటలకు సుదూర ప్రాంతాల నుండి వస్తుంటారు. తోటల్లో నేరుగా కొనుగోలు చేసుకుంటే ఆ ధరలు మరింత భారంగా ఉంటాయి. ఈ ఏడాది ముందెన్నడూ లేని విధంగా కిలోల లెక్కన తూకానికి అమ్ముతున్నారు.

కిలో బంగినపల్లి ధర రూ.60

మొగల్తూరు బంగినపల్లి మామిడిపండ్లు కిలో రూ.60 నుంచి రూ.70లకు విక్రయిస్తున్నారు. రానున్న మరికొద్ది రోజుల్లో ఈ ధర ఇంకా పెరిగే అవకాశం ఉంది. చెరుకు రసాలు డజను రూ.450 నుంచి 600 వరకూ ధర ఉంది. ఇతర రకాలు కిలో 40 నుంచి 60 రూపాయల వరకూ విక్రయిస్తున్నారు.

రైతులకు ప్రోత్సాహం లేదు

చేతికి వచ్చిన మామిడి కాయలను ముగ్గబెట్టేందుకు, పచ్చికాయలను నిల్వ చేసేందుకు గోడౌన్ సదుపాయం లేక అద్దెలు చెల్లించలేకపోతున్నారు. మామిడికాయలు ముగ్గబెట్టేందుకు గదులు అద్దెకు ఇస్తే ఆ ప్రాంతం దోమల బెడదతోపాటు అపారిశుద్ధ్యంగా ఉంటుందని ఎక్కువ అద్దెలు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నుంచి మొగల్తూరు మామిడి ఫలసాయం రైతులకు అనువుగా ఒక్క గోడౌన్‌కు నిర్మించలేదు.

అలాగే రైతులకు హార్టికల్చర్ శాఖ నుంచి పురుగు మందులు, తోటలకు నీరు తోడుకునే సదుపాయాలకు ఏ రకం మందులు వాడాలో కనీస సమాచారం లేక కేవలం ఎరువుల దుకాణం యజమానులు చేప్పే సూచనలతోనే మామిడి తోటలకు మందులు వాడుతున్నారు. ఇలా అన్ని విధాలుగా ఇబ్బంది పడుతున్నారు.



రుచిలో మొగల్తూరు మామిడి

మొగల్తూరు మామిడికి తెలుగు రాష్ట్రాల్లోనే ప్రత్యేకత ఉంది. ఇక్కడ ముఖ్యంగా లభించే బంగినపల్లి మామిడి పండ్లు రంగు, రుచి, వాసన, సైజు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. ఇక్కడ పూత ఆలస్యంగా వచ్చి దిగుబడి ఆలస్యంగానే వస్తుంది. మే, జూన్ నెలాఖరు వరకూ ఇక్కడ మామిడి పండ్లు అందుబాటులో ఉంటాయి. గత ఏడాది వర్షాలు తక్కువగా ఉండటం, పూత దశ నుంచి వాతావరణ మార్పులు, మంచు ప్రభావంతో ఈ ఏడాది దిగుబడులు తగ్గాయి.

పంచాయతీలకు పదోన్నతులు



- గ్రామంలో పది వేల జనాభా లేదా కోటి ఆదాయం వుంటే ప్రత్యేక గ్రేడ్
- నాలుగు వేల నుంచి పది వేలలోపు జనాభా వుంటే గ్రేడ్-1
- గ్రేడ్‌లు మార్చేందుకు జిల్లాలో 409 పంచాయతీల వివరాలు పంపాలని ప్రభుత్వం ఆదేశం

భీమవరం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు పదోన్నతులు లభించనున్నాయి. పంచాయతీల్లో జనాభా, ఆదాయం ప్రాతిపదికన గ్రేడ్‌లు కేటాయించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన నిబంధనలు కలిగిన వివరాలు పంచాయతీల వారీగా అందించాలని పంచాయతీరాజ్ శాఖను ఆదేశించింది. ఇప్పటి వరకు ఉన్న పంచాయతీలకు ఉన్న గ్రేడ్‌లు మారనున్నాయి. ఇకపై స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా నిర్ణయించనున్నారు. అసలు గ్రేడ్‌లు కలిగిన పంచాయతీలుగా 2001లో ఏర్పాటుచేశారు. అప్పట్లోనే ప్రతి పంచాయతీకి కార్యదర్శులను అందుబాటులోకి తెచ్చారు. మరలా ఇప్పుడు పంచాయతీ గ్రేడ్‌లలో మార్పులు రానున్నాయి. జిల్లాలో 409 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 125 పంచాయతీలు గ్రేడ్-1గాను, 69 గ్రేడ్-2గాను, 49 గ్రేడ్-3గాను 50 గ్రేడ్-4గాను, 116 పంచాయతీలు గ్రేడ్-5గా నడుస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని గ్రామ పంచాయతీల గ్రేడ్‌లలో మార్పులు రాబోతున్నాయి.

వీటికి స్పెషల్ గ్రేడ్‌లే

పట్టణానికి ఆనుకుని ఉన్న పంచాయతీలకు మండల ముఖ్య కేంద్రాలుగా వున్న గ్రామాలకు స్పెషల్ గ్రేడ్‌లు వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో పెనుగొండ, గణపవరం, రాయలం, చిన అమిరం ఇలాంటి గ్రామాలు ఆదాయంలో రూ. కోటి పైబడి జనాభా 10 వేలు పైబడి ఉన్నాయి. దీంతో ఇలాంటి పంచాయతీలు స్పెషల్ గ్రేడ్‌లో వెళ్తాయి.

ఇకపై గ్రేడ్‌లు ఇచ్చేదిలా..

- గ్రామాల్లో 10 వేలకు పైగా జనాభా ఉన్నా లేదా కోటి రూపాయల ఆదాయం మించి ఉన్నా వాటిని స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా పరిగణిస్తారు.
- నాలుగు వేల నుంచి 10 వేలలోపు జనాభా ఉన్న గ్రామాలు, లేదా రూ.50 లక్షల పైబడి ఆదాయంవున్న పంచాయతీలను గ్రేడ్-1గా నిర్ణయిస్తారు.
- రెండు వేల నుంచి నాలుగు వేలలోపు జనాభా ఉన్న పంచాయతీలు గ్రేడ్ -2గా ఇస్తారు.
- రెండు వేలలోపు జనాభా కలిగిన వాటికి గ్రేడ్-3గా కేటాయిస్తారు.

జయహో జవాన్ !

6 సాహసికులకు స్ఫూర్తి ఉదయ భాస్కర్.. సైన్యంలో సేవలు

సాఫ్ట్‌వేర్ వదిలి సైన్యంలోకి.. మేజర్లుగా సేవలందిస్తున్న దంపతులు

వైద్యుల కొరతను తీరుస్తాం

- తణుకు జిల్లా ఆసుపత్రి సలహా మండలి సమావేశంలో కలెక్టర్ నాగరాణి



తణుకు, మే 17(ఆంధ్రజ్యోతి):తణుకు జిల్లా ఆసుపత్రిలోని వైద్యుల కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నాగరాణి హామీ ఇచ్చారు. శనివారం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్పెషలిస్టు వైద్యులతోపాటు, సాధారణ వైద్యులు, ఇతర టెక్నీషియన్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం. డయాలసిస్ కేంద్రంలో 15 బెడ్లు పెంచేందుకు కృషి చేస్తాం. తణుకులో బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు నుంచి అనుమతులు వచ్చాయి. త్వరలోనే దీనిని అందుబాటులోకి తీసుకుని వస్తాం' అని వివరించారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాల కల్పనకు, వైద్యులు, సిబ్బంది నియామకాలకు కృషి చేయాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిర్మించే పింక్ టాయిలెట్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బస్టాండ్ ఆవరణలో చలివేంద్రం పరిశీలించారు. కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చినవెంకన్న దర్శనార్థం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

చిన వెంకన్నకు భక్తుల తాకిడి

ద్వారకాతిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): గోవిందనామస్మరణతో ద్వారకాతిరుమల క్షేత్రం మారుమోగింది. వేసవి సెలవులతో పాటు స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయానికి స్వామి దర్శనార్థం విశేషసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. సుమారు 18 వేల మంది పైబడి భక్తులు స్వామివారిని దర్శించినట్టు ఆలయ వర్గాల అంచనా. స్వామి వారి ఉచిత దర్శనానికి దాదాపు రెండు గంటల పైబడి సమయం పట్టింది. దర్శనానంతరం భక్తులు ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

స్వామి వారిని దర్శించుకున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్, కలెక్టర్ వెట్రిసెల్వి

చిన వెంకన్నను శనివారం ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి జవహర్, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి జవహర్‌కు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలవారికి మరింత మేలు జరగాలని ఆ దేవదేవుని కోరుకున్నట్లు చెప్పారు. కలెక్టర్ వెట్రిసెల్వి శ్రీవారి దివ్యమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆమెకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం గజ, గోశాలను సందర్శించారు. సప్తగోకులంలో గోపూజ చేశారు. గజలక్ష్మి నుంచి ఆశీర్వాదాన్ని అందుకున్నారు.



జవహర్‌కు స్వామివారి ఫొటో అందిస్తున్న ఆలయ అధికారులు



గజలక్ష్మి నుంచి ఆశీర్వాదం అందుకుంటున్న కలెక్టర్



గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సత్తి సుబ్బారెడ్డికి ఆంజనేయస్వామి చిత్రపటం అందజేస్తున్న ఈవో చందన

ద్వారకాతిరుమల, మద్ది క్షేత్రాల్లో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

ద్వారకాతిరుమల/జంగారెడ్డిగూడెం, మే 17 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి శనివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి మూలవిరాట్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈవో ఆర్‌వీ చందన, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అర్చకులు వేదాశీర్వచనాలు అందజేశారు. పట్టణం లోని గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వస్వామిని దర్శించుకున్నారు. జంగారెడ్డిగూడెం సివిల్ జడ్జి కిషోర్ కుమార్, జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కెఎస్ఆర్ తేజస్వి, భీమడోలు మేజిస్ట్రేట్ ప్రియదర్శిని, జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవి.రమణ పాల్గొన్నారు.



అభయాంజనేయస్వామి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని సతీమణి రాధారాణి

ఘనంగా అప్పనవీడు అభయాంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభం

పెదపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం అప్పనవీడులోని ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి వారి 24వ హనుమజ్జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సతీమణి రాధారాణి ఉత్సవాలను ప్రారంభించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలు ఈనెల 22వ తేదీ వరకు నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తొలిరోజు స్వామివారికి సుప్రభాతసేవ, 1008 గులాబీ పూలలు, వెండి, బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజలు, నక్షత్ర హారతి నిర్వహించారు. సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన, మ్యూజికల్ నైట్ నిర్వహించారు. కార్యక్రమంలో వేమూరి శ్రీనివాసరావు, గారపాటి రామసీత, వడ్డి వాసవి, మరడాని రవికుమార్, మట్టా శ్రీనివాసరావు, ఇవో తారకేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ పుట్టాను కలిసిన హీరో బెల్లంకొండ శ్రీనివాస్



ఏలూరు రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : హీరో బెల్లంకొండ శ్రీనివాస్, భైరవం సినిమా యూనిట్ సభ్యులు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌ను శనివారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ కార్యక్రమం ఏలూరులోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీని ఆహ్వానించగా తప్పనిసరిగా విచ్చేస్తానని వారికి చెప్పారు.





అగ్నిపూల అందాలు...

చెట్టు నిండుగా పూలతో అగ్నిపూల చెట్లు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. గతంలో రహదారుల పక్కనే ఉండి ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచేవి. రోడ్డు విస్తరణ పనుల్లో ఇవి కనుమరుగవుతున్నాయి. ఆకులు లేకుండా చెట్టునిండా కేవలం పూలు మాత్రమే పూయడం దీని ప్రత్యేకత. ద్వారకాతిరుమల నుంచి సత్తెన్నగూడెం వెళ్లే రహదారి, శ్రీవారి శేషాచల కొండపైనా, పంగిడిగూడెం నుంచి వేంపాడుకు వెళ్లే దారిలోనూ ఈ చెట్లు ఆహ్లాదాన్నిస్తున్నాయి. రమణీయ సోయగాలతో పలువురిని ఆకట్టుకుంటున్నాయి.

- ద్వారకాతిరుమల (ఆంధ్రజ్యోతి)

జయహో జవాన్ !



అంబాల రెజిమెంట్ హెడ్ క్వార్టర్‌లో ఉదయ భాస్కరరావు విగ్రహ ఆవిష్కణ..ఈచిత్రంలో భాస్కర్ కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు. (ఫైల్ ఫొటో)

సాహసికులకు స్ఫూర్తి ఉదయ భాస్కర్

భారత సైన్యంలో సేవలు



తణుకు రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆర్మీలో చేరి దేశ రక్షణకు పాటుపడాలని, భారతమాత సేవలో తరించాలనే లక్ష్యంతో చిన్నప్పటి నుంచి కఠోర శ్రమకోర్చి భారత సైన్యంలో సేవలందించిన ఎందరో ఉన్నారు. వారిలో తణుకుకి చెందిన మద్దిపాటి ఉదయ భాస్కరరావు సాహసయాత్ర సైనికులకు, పర్వతారోహకులకు స్ఫూర్తిగా నిలిస్తున్నాయి.ఆయన సాహసానికి గుర్తుగా ఆయన చదివిన కోరుకొండ సైనిక్ స్కూల్, లెఫ్టినెంట్‌గా పనిచేసిన అంబాల కంటోన్మెంట్‌లో, ఇండియన్ మౌంటనీరింగ్ ఇనిస్టిట్యూట్‌లోను ఆయన విగ్రహాలను, వస్తువులను వుంచడం ఆంధ్రులకు గర్వకారణంగా నిలుస్తుంది. 2015లో జరిగిన ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాలకు తణుకులోని ఆయన సోదరుడు రాజశేఖర్ దంపతులను కూడా భారత ప్రభుత్వం ఆహ్వానించడంతో వారు హాజరయ్యారు.

తణుకు పట్టణానికి చెందిన మద్దిపాటి ఉదయ భాస్కరరావు చిన్నప్పటి నుంచి సాహసంతో కూడిన పనుల్లో చురుగ్గా ఉండేవారు. అదే ఉత్సాహంతో కోరుకొండ సైనిక్ స్కూల్‌లో ఐదవ తరగతి నుంచి 11వ తరగతి వరకూ చదువుకున్నారు. పూనేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)లో డిగ్రీ పూర్తి చేసి మిలటరీలో చేరారు. డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలటరీ అకాడమీ (ఐఎంఏ)లో శిక్షణ పూర్తి చేశారు. 1982లో ఆయన 22 ఏళ్ల వయసులోనే సెకండ్ లెఫ్టినెంట్‌గా 71వ ఆర్మ్‌డ్ రెజిమెంట్ ఆఫీసర్‌గా పంజాబ్‌లో విధులు చేపట్టారు. 1984లో లెఫ్టినెంట్‌గా పదోన్నతి పొంది 11వ ఆర్మ్‌డ్ రెజిమెంట్ జమ్మూ కాశ్మీర్‌కు బదిలీ అయ్యారు. ఆయనకు మొదటి నుంచి క్రీడలపై ఉన్న ఆసక్తి కశ్మీర్‌లోని పర్వతాలు అధిరోహించడంపై ఆసక్తిని పెంచాయి. పర్వతారోహణపై డార్జిలింగ్‌లో శిక్షణ పొందారు. ప్రపంచంలోనే ఎత్తైన యుద్ధభూమి సియాచిన్‌లో ఆరు నెలల పాటు ఉన్నారు.భారత్ సైన్యం తరఫున అంటార్కిటికా యాత్రకు, హిమాలయాల కార్ ర్యాలీకి ఎంపికయ్యారు.

ఎవరెస్ట్ శిఖర అధిరోహణలో మృత్యువాత

ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్ట్ శిఖరం అధిరోహించేందుకు తొలిసారిగా భారత సైన్యానికి చెందిన 45 మంది సాహసికుల బృందంలో ఉదయ భాస్కర్ చిన్న వయస్కుడు. అప్పటికి ఆయన వయసు 24 ఏళ్లు. మొత్తం బృందంలో చివరకు ఐదుగురు మాత్రమే ఎవరెస్ట్ శిఖరం సౌత్ పోల్ మీదుగా చేరుకున్నారు. కేవలం 200 మీటర్ల దూరంలో వుండగా గంటకు 240 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులకు, మైనస్ 50 డిగ్రీల హిమపాతంలో చిక్కుకుని అక్టోబరు 8న ఒకరు, 9న, 10న ఒకరు చివరగా ఉదయ భాస్కర్ మృత్యువాత పడ్డారు. ఉదయ భాస్కర్ ధైర్య సాహసాలు గుర్తించిన భారత ప్రభుత్వం ఆయన చదివిన కోరుకొండ సైనిక స్కూల్ ఆవరణలో, పనిచేసిన అంబాల కంటోన్మెంట్‌లో,పర్వతారోహణలో శిక్షణ పొందిన డార్జిలింగ్‌లోనూ ఉదయ భాస్కరరావు విగ్రహాలను ఏర్పాటు చేయడంతో పాటు వివిధ వస్తు ప్రదర్శనశాలల్లో ఆయన ఫొటోలు, ఆయన వినియోగించిన వస్తువులను భద్రపరిచింది.

సాఫ్ట్‌వేర్ వదిలి సైన్యంలోకి..

భారత సైన్యంలో మేజర్‌లుగా సేవలందిస్తున్న తణుకు దంపతులు



బొల్లిన భావన, ఆదిత్య దంపతులు

తణుకు రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి):సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నేటి యువతకు కలల కొలువు. అలాంటి ఉద్యోగాన్ని, సౌకర్యాలను కాదని సైన్యంలో చేరి దేశ రక్షణలో సేవలందిస్తున్న మేజర్ బొల్లిన భావన నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారు. తణుకు పట్టణానికి చెందిన మేజర్ బొల్లిన భావన భారత రిటైర్డ్ మేజర్ జనరల్ బొల్లిన వెంకటరావు, సుజాతల కుమార్తె. తండ్రి భారత ఆర్మీ అధికారి కావడంతో భావన విద్యాభ్యాసం దేశంలోని వివిధ ప్రాంతాల్లో సాగింది. డెహ్రాడూన్, ఢిల్లీ, పూణే, హైదరాబాద్‌లతో పాటు భూటాన్ దేశంలో భావన విద్యాభ్యాసం చేశారు. బెంగుళూరులో క్రిస్టియన్ కళాశాలలో బీకాం, పూనేలో ఎంబీఏ ఫైనాన్స్ చదివారు. డెల్లాయిట్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేరి 2017 వరకూ ఉద్యోగం చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో ఎన్నో సౌకర్యాలతో మంచి వేతనాలు ఉన్నప్పటికీ 2017లో చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో చేరి మిలటరీ శిక్షణ పొందారు. అనంతరం 2018లో ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్‌గా విధులలో చేరారు. ప్రస్తుతం భారత ఆర్మీలో మేజర్‌గా కొనసాగుతున్నారు. దక్షిణ సుడాన్‌లో ఐక్యరాజ్యసమితి మిలటరీ పరిశీలకురాలిగా భారత ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. ఈమె భర్త ఆదిత్య నల్లూరి కూడా భారత ఆర్మీలో మేజర్. విశాఖ పట్టణానికి చెందిన ఆదిత్య బీటెక్ ఎలక్ట్రికల్ చదివి గూగుల్ సంస్థలో ఎనలిస్ట్‌గా ఒక సంవత్సరం పని చేశారు. అనంతరం ఇండియన్ మిలటరీ అకాడమీలో చేరి ఆర్మీలో కార్ప్స్ ఆఫ్ ఇంజనీర్‌గా ఈస్ట్రన్ సెక్టార్, రాష్ట్రీయ రైఫిల్స్, జమ్ము అండ్ కశ్మీర్ వెస్ట్రన్ సెక్టార్‌లలో విధులు నిర్వహించారు. పుస్తుతం జమ్మూ, కశ్మీర్‌లో మేజర్‌గా పనిచేస్తున్నారు.





అనశ్వరం నాటికలో దృశ్యం .. విడాకులు కావాలి నాటికలో ఒక సన్నివేశం

సందేశాత్మకంగా నాటక ప్రదర్శనలు

ఏలూరులో జాతీయస్థాయి నాటిక పోటీలు ప్రారంభం

ఏలూరు రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో జరుగుతున్న వాస్తవాలను ప్రజలకు కళ్ళకు కట్టినట్లు చూపించేవి నాటకాలని నాటకం సజీవమైనదని దాన్ని ప్రాణపదంగా చూసుకోవడం కళాకారులకు పరీక్ష వంటిదని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శనివారం రాత్రి అంబికా సంస్థల వ్యవస్థాపకులు ఆలపాటి రామచంద్రరావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఏలూరు వైఎంహెచ్ఏ, హేలాపురి కళాపరిషత్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి నాటక పోటీలు ప్రారంభమయ్యాయి. ఏలూరు ఎమ్మెల్యే చంటి, జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ జ్యోతి ప్రజ్వలన చేసి నాటకోత్సవాలను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ మాట్లాడుతూ కళా రంగానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. నాలుగు రోజుల పాటు జరుగునున్న నాటకోత్సవాల్లో భాగంగా తొలిరోజు ప్రదర్శించిన రెండు నాటికలు ప్రేక్షకులను అలరించాయి. సందేశాత్మకంగా సాగాయి.

రెండు మనసుల సంఘర్షణే అనశ్వరం

మానసిక రోగులను నయం చేయడానికి మందులు ఉన్నాయి. డాక్టర్లు, మందుల వల్ల నయం కాక ఆత్మహత్యలకు పాల్పడిన వారందరికీ కౌన్సెలింగ్, సైకోథెరపీ ట్రీట్‌మెంట్ ద్వారా సూర్య పునర్జన్మను ప్రసాదిస్తాడు. కానీ ఏమీ తెలియని అమాయకులు, అనాగరికులు ఎందరో ? అటువంటి వాళ్ళలో ఒకరినైనా మార్చినప్పుడే నీ గొప్పతనమని సూర్యకు స్నేహితుడు చాలెంజ్ విసురుతాడు. సూర్య ఒక గిరిజన అమ్మాయి కల్పనకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత స్థానానికి తీసుకువస్తాడు. ఉన్నత స్థానానికి వచ్చిన కల్పన సూర్య నుంచి దూరంగా వెళ్లి అనాథ శరణాలయం ఏర్పాటు చేసి అనాథలకు ఆశ్రయం ఇస్తుంది. సూర్య కల్పనను మర్చిపోలేక పిచ్చివాడిగా మారిపోతాడు. ఒక స్వచ్ఛంద సేవా సంస్థ కల్పన సేవలను గుర్తించి సత్కరిస్తున్న సభలో సూర్య కల్పనను కలుసుకుంటారు. అప్పుడు వాళ్లిద్దరి మధ్య జరిగిన సంఘర్షణే అనశ్వరం నాటిక ఇతివృత్తం.

వివాహ వ్యవస్థపై సంధించిన బాణం..

మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని, అందుకు భార్యభర్తల మధ్య ఉండవలిసిన వైవాహిక దాంపత్యానికి మినహాయింపులు ఏమీ లేదంటున్న నేటి యువతకు కనువిప్పు కలిగించేలా ప్రదర్శించిన 'విడాకులు కావాలి' నాటిక రక్తి కట్టించింది. ఆర్థికపరమైన స్వేచ్ఛలు పెరుగుతూ చిన్న చిన్న కారణాలతోనే భార్యభర్తల మధ్య తలెత్తే అభిప్రాయ బేధాలతో విడాకులు కోసం కోర్టుల చుట్టూ పరిగెత్తుతూ తమ పిల్లల భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మారుస్తున్న నేటి తల్లితండ్రుల తీరును కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించారు. అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి నాటికను వల్లూరు శివప్రసాద్ రచించగా గంగోత్రిసాయి దర్శకత్వం వహించారు. మార్కెట్ యార్డు చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, ఎస్ఎమ్ఆర్ పెదబాబు, వైఎంహెచ్ఏ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, సెక్రటరీ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షుడు ఇరదల ముద్దుకృష్ణ, సెక్రటరీ మజ్జి కాంతారావు, సంకు సురేష్, పెదపాటి రామకృష్ణ, మహమ్మద్ ఖాజావలీ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో సిద్ధమవుతున్న కొత్త లగ్జరీ కారు

చింతమనేని కొత్త కారుకు షోకులు

మహానాడులో ప్రత్యేక ఆకర్షణ..

పెదవేగి, మే 17 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రజల మధ్య తిరుగుతూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మరోసారి వార్తల్లో నిలిచారు. తాజాగా ఆయన ఒక కొత్త లగ్జరీ కారును కొనుగోలు చేశారు. కారు కొనడం వింతేమీ కాదు. కానీ, ఆ కారును తన అభిరుచులకు తగ్గట్టుగా మార్చుకోవడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. రూ.56 లక్షలతో కొనుగోలు చేసిన టయోటా లెజండరీ కారుకు మార్పులు చేయించారు. కారు ముందుభాగంలో ఉండే కంపెనీ లోగోను తీసి వేసి అక్కడ సైకిల్ గుర్తు ఏర్పాటు చేశారు. కారు పైభాగం (రూఫ్) మొత్తాన్ని పసుపు రంగుతో నింపారు. రాత్రి సమయంలో కారులో ఉన్న తాను బయటి వ్యక్తులకు కనబడేలా ముఖభాగంలో వెలుగు పడేలా అదనంగా లైటు ఏర్పాటు చేయించారు. ఈ ఏర్పాట్లకు మరో రూ.ఐదు లక్షలవరకు వ్యయమవుతుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఈ కారులోనే తాను ఈనెల 27 నుంచి 29వ తేదీవరకు కడపలో జరిగే మహానాడుకు రోడ్డు మార్గాన భారీ ప్రదర్శనగా బయలుదేరి వెళ్తానని చెప్పారు.హైదరాబాద్‌లో సిద్ధమవుతున్న కారు ఆదివారం నాటికి దుగ్గిరాలకు తీసుకువస్తామని తెలిపారు. మహానాడులో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ప్రభాకర్ ఆనందంగా చెప్పారు.

కంటికి ఇంపు.. తింటే ముప్పు !

కాయలను మగ్గించేందుకు రసాయనాలు

వాటిని తింటే అనారోగ్యమంటున్న వైద్యులు



ఇరగవరం, మే 17 (ఆంధ్రజ్యోతి) : రోజుకో పండు.. ఆరోగ్యానికి మెండు అని వైద్యులు చెబుతుంటారు. కానీ నేడు మార్కెట్లో భిన్న పరిస్థితులు నెలకొంటున్నాయి. పండు తింటే క్రమేపీ ఆరోగ్యాలు క్షీణించి పోయే పరిస్థితులు వస్తున్నాయి. దీనికి కారణం రసాయనాలు వినియోగం. తణుకు నియోజకవర్గ పరిధిలో పండ్ల మార్కెట్‌లో కొందరు వ్యాపారులు అరటి, మామిడి కాయలను కృత్రిమంగా మగ్గిస్తున్నారు. వాటికి రసాయనాలు వినియోగిస్తూ ప్రజారోగ్యానికి చేటు తెస్తున్నారు. పూర్వం చెట్టున కాయలు పక్వానికి వచ్చిన తర్వాత అరటి గెలలు, మామిడి కాయలను కోసేవారు. తర్వాత కాయలను మగ్గపెట్టేందుకు అగరబత్తీలను వాడేవారు. అవి పండ్లు అవడానికి నాలుగు రోజుల వరకు పట్టేది. నేడు రసాయనాలు వినియోగిస్తుండడంతో గంటల్లోనే మగ్గిపోతున్నాయి. తణుకు మార్కెట్‌లో కొందరు వ్యాపారస్తులు రసాయనాలతో కాయలను మగ్గపెడుతున్నారు. ఇలా మగ్గించిన పండ్లు చూడటానికి బాగున్నా తినే సమయంలో అంత రుచిగా ఉండవని పలువురు పేర్కొంటున్నారు. తణుకు పట్టణంతో పాటు ఇరగవరం, అత్తిలి మండలాలలో సుమారు 70 నుంచి 100 వరకు అరటి, మామిడి పళ్ల వ్యాపారులు ఉండగా సగానికి పైగా వ్యాపారులు రసాయనాలు వాడుతున్నారు. మార్కెట్‌లో చైనా మందు విపరీతంగా వాడుతున్నారు. 100 మిల్లీ లీటర్ల మందు కేవలం 200 రూపాయలకే దొరుకుతుంది. ఈ రసాయనం చల్లడం వలన కేవలం గంటలోపే కాయలు రంగు వచ్చేస్తాయి. కొందరు వ్యాపారులు డ్రమ్ముల్లో రసాయనం కలిపి అందులో అరటి కాయలను ముంచుతున్నారు. ఇలా ప్రతి రోజు వేల సంఖ్యలో అరటి గెలలను సరఫరా చేస్తున్నారు. ఇవి తినడం ద్వారా క్యాన్సర్ వంటి రోగాలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

తనిఖీలు శూన్యం

మార్కెట్‌లో రసాయనాలతో మగ్గించిన పండ్లను విచ్చలవిడిగా విక్రయిస్తున్నా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కన్నెత్తి చూడకపోవడంతో వ్యాపారస్తులకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది.ఇటువంటి వ్యాపారులపై అధికారులు కఠిన చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

ఆకస్మికంగా తనిఖీలు చేపడతాం

మామిడి , అరటి పళ్ళను కార్బైడ్‌తో మాగేసి విక్రయించే దుకాణాలపై ఆకస్మికంగా తనిఖీలు చేపడతాం.వ్యవసాయ అధికారులతో కలిసి దాడులు నిర్వహిస్తాం. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులను గుర్తించి దుకాణాలు సీజ్ చేయడమే కాకుండా వారిపై కేసులు నమోదు చేస్తాం. ప్రజలకు వీటిపై అవగాహన కల్పిస్తాం.

- సుందరరామిరెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, భీమవరం

పౌర వలంటీర్లుగా చేరండి



వలంటీర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా నెహ్రూకేంద్ర యువజన అధికారి రాము

ఏలూరు క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉన్న యువత మై భారత్ డిఫెన్స్ పౌర వలంటీర్లుగా చేరాలని జిల్లా నెహ్రూ కేంద్ర యువజన అధికారి సుంకర రాము యువతకు సూచించారు. ఏలూరు లక్ష్మీవారపుపేటలో ఉన్న నెహ్రూ కేంద్ర కార్యాలయంలో శనివారం వలంటీర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం వలంటీర్లకు అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలోని యువతకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో, సంక్షోభ సమయాల్లో కీలకపాత్ర పోషించడానికి యువ పౌరులను శక్తి వంతం చేయడానికి స్వచ్ఛంద దళాన్ని నిర్మించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఉత్సాహవంతులైన యువత సివిల్ డిఫెన్స్‌లో చేరడానికి ఆన్‌లైన్ ద్వారా తమ పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. మై భారత్ పోర్టల్‌లో తమ నమోదు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

స్కూపీతోనే మాకు ఆనందం..

కుక్కపిల్లను కన్న కొడుకులా చూసుకుంటున్న దంపతులు



వారికి ఆ కుక్కపిల్లతో ఎనలేని అనుబంధం.. కన్నకొడుకులా దాన్ని చూసుకుంటారు.. దానికి ముద్దుగా స్కూపీ అని పేరు కూడా పెట్టుకున్నారు.. ఆచంటకు చెందిన ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్, మాధవి దంపతులు 2013లో ఒక కుక్కపిల్లను ఎక్కడి నుంచో తెచ్చుకుని పెంచుకుంటున్నారు. వారు ఎక్కడకి వెళ్లినా వారితో పాటే స్కూపీ ఉండాల్సిందే.. 2015లో జరిగిన గోదావరి పుష్కరాల్లో వారితో పాటు స్కూపీని కూడా తీసుకువెళ్లి పుష్కర స్నానాలు చేయించారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాల్లో తమతో తీసుకు వెళతామని గోదావరి స్నానాలు చేయిస్తామని వారు చెప్పారు. పిల్లలు లేరని దీన్నే కన్న కొడుకులా చూసుకుంటున్నామని తెలిపారు

- ఆచంట (ఆంధ్రజ్యోతి)

286 మంది కానిస్టేబుళ్ల బదిలీ

ఏలూరు క్రైం, మే 17(ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది క్రమశిక్షణతో ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవడం ఎంతో ముఖ్యమని, ప్రజల భద్రతే లక్ష్యంగా ఉద్యోగం నిర్వర్తించాలని ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. ఏలూరు జిల్లాలో ఒకే ప్రాంతంలో ఐదేళ్ల పైబడి పనిచేసిన 286 మంది కానిస్టేబుళ్లకు పారదర్శకంగా బదిలీల ప్రక్రియను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనతో పాటు అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ల ద్వారా పోలీస్‌స్టేషన్ల ఖాళీలను డిస్‌ప్లే చేసి ఖాళీలకు అనుగుణంగా కోరుకున్న స్థానాలకు సిబ్బందిని బదిలీ చేశారు. పట్టణాల్లో పని చేస్తున్న వారిని రూరల్ పోలీస్‌స్టేషన్లకు, రూరల్ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న వారిని పట్టణ ప్రాంతాల బదిలీకి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ బదిలీకి హాజరైన 286 మందికి భోజన వసతి ఏర్పాటు చేసి ఆయనే స్వయంగా వడ్డన చేసి సిబ్బందితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఎస్‌బీ ఎస్ఐ గంగాధరరావు, డీసీఆర్బీ ఎస్ఎస్ఐ రాజారెడ్డి, పోలీసు అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు ఆర్. నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు కార్యదర్శుల సస్పెన్షన్‌కు సిఫారసు

ఏలూరు, మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో పనిచేస్తున్న ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెండ్ చేయడానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌కు సిఫారసు చేస్తూ రాష్ట్ర గ్రామ సచివాలయ, వార్డుశాఖ డైరెక్టర్ శివప్రసాద్ శనివారం నిర్ణయం తీసుకున్నారు. భీమడోలు మండలం భీమడోలు సెక్రటరీ-1 కేవీ లక్ష్మీతనూజ, టి.నరసాపురం మండలం టి. నరసాపురం సెక్రటరీ కె.హరికృష్ణ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వీరిపై తుది నిర్ణయం తీసుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్‌కు సరెండర్ చేస్తూ నిర్ణయం వెలువరించారు.



గ్రీన్‌పార్క్‌ను శుభ్రం చేస్తున్న జీఎం, ఉద్యోగులు

పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన ఉండాలి

తణుకు, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పచ్చదనం, పరిశుభ్రత, గ్రీన్ ఎనర్జీపై అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రా షుగర్స్ జనరల్ మేనేజర్ ఎ.సాంబశివరావు అన్నారు. శనివారం ఆంధ్రా షుగర్స్ ప్రాంగణం గ్రీన్ పార్కు వద్ద బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రత తీవ్రత, ఉపశమనం పొందే మార్గాలను, స్వచ్ఛత, పచ్చదనం, పరిశుభ్రత గ్రీన్ ఎనర్జీపై అవగాహన కల్గి ఉండాలని చెప్పారు. గ్రీన్ పార్కు వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం పార్కును శుభ్రం చేసి ప్రతిజ్ఞ చేశారు. అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి.శ్రీనివాసు, పర్యావరణ విభాగం నుంచి జి. ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ల మాక్ డ్రిల్

ఏలూరు అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా ఎన్‌సీసీ ఆంధ్రా బెటాలియన్ ఉమ్మడి పశ్చిమ జిల్లా కేడెట్లకు శనివారం స్థానిక విన్సెంట్ డీపాల్ కళాశాలలో అగ్నిప్రమాదాల నివారణ, ఫైర్ ఫైటింగ్‌లపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఏలూరు అగ్ని మాపకశాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో ఆకస్మికంగా వంటగ్యాస్ లీక్ సంఘటనలు, అగ్ని ప్రమాదాలు, ప్రమాద తీవ్రతను ఎలా నియంత్రించవచ్చో డెమో ద్వారా ఎన్‌సీసీ కెడెట్లతో చేయించామని ఎన్‌సీసీ జిల్లా కార్యాలయ సూపరింటెండెంట్ కొండయ్య తెలిపారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్‌పాండే, క్యాంప్ కెప్టెన్ కె.శివశంకర్, ఉమ్మడి జిల్లా ఏఎన్‌వోలు, పీఐ సిబ్బంది పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్ నిర్వహిస్తోన్న ఎన్‌సీసీ కేడెట్లు

యువతి ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి) : కొంతమంది తనను వేధిస్తున్నారని ఒక యువతి కూల్ డ్రింక్‌లో కోలిన్ కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఏలూరులోని దక్షిణపువీధినకు చెందిన ఒక యువతి (20) డిగ్రీ చదివి ఉద్యోగ ప్రయత్నాల్లో ఇంటి వద్ద ఉండి ప్రిపేర్ అవుతుంది. ఆ ప్రాంతంలో ఆమె కుటుంబం అద్దెకు ఉంటున్న యజమాని ఇంట్లో గత ఏడాది ఒకసారి, ఈ ఏడాది ఫిబ్రవరిలో మరోసారి బంగారం పోయింది. దీంతో ఈ ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆ యువతే ఈ నేరం చేస్తున్నదని అల్లరి చేస్తున్నారు. ఇటీవల ఆ సమీపంలోని మరో ఇంట్లో దొంగతనం జరగడంతో ఆ దొంగతనం ఆ యువతి, ఆ యువతి స్నేహితులు, మరో ఇద్దరు కలిసి ఈ నేరానికి పాల్పడ్డారంటూ అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయించారు. దీంతో పోలీసులు ఆ యువతిని పిలిచి వాగ్మూలం నమోదు చేసి పంపించి వేశారు. ఆ ముగ్గురు యువకులు తనను వేధిస్తున్నారంటూ 12వ తారీఖున జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేసింది. వారి వేధింపులు భరించలేక ఆ యువతి ఈనెల 16వ తేదీ సాయంత్రం కూల్‌డ్రింక్‌లో కోలిన్ కలుపుకుతాగి సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె పరిస్థితి గమనించిన కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మోటారు సైకిల్ దొంగకు ఏడాది జైలు శిక్ష

ఏలూరు క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్ దొంగతనం చేశాడని ఒక యువకునిపై నేరం రుజువు కావడంతో సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ ఏలూరులోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ (ఎక్సైజ్ కోర్టు) కె స్పందన తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొయ్యలగూడెం మండలం చొప్పరామన్నగూడెం గ్రామానికి చెందిన సప్పిడి ముసలయ్య (30) ప్రస్తుతం గణపవరం మండలం ముగ్గుళ్ళ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. గత ఏడాది ఏలూరులో మోటారు సైకిల్ అపహరించడంతో గణపవరం ఎస్ఐ మణికుమార్, ఏలూరు రూరల్ ఎస్ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్ కలిసి ముసలయ్యను అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని ఎక్సైజ్ కోర్టులో విచారణ సాగింది. ముసలయ్యపై నేరం రుజువు కావడంతో జడ్జి శిక్ష విధించారు.

హెల్మెట్‌తోనే ప్రాణానికి రక్ష

ప్రమాదాల బారినపడుతున్న యువత



ఇటీవల నిడమర్రు గామానికి చెందిన ఓ వ్యక్తి మరికొద్ది రోజులలో తన కుమార్తె పెళ్లి జరుగుతున్న వేళ బంధుమిత్రులకు పెళ్లి శుభలేఖలు పంచుతూ దెందులూరు మండలం గరుడ హోటల్ వద్ద రోడ్డు రోడ్డుపై వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఈ ఘటనలో హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రమాదం బారిన పడి ప్రాణాలు కోల్పోయారు.

ఇటీవల పెంటపాడులో జరిగిన రోడ్డు ప్రమాదం లో అడవికొలను గ్రామానికి చెందిన ఓ ఆక్వా షాపు యజమాని ఉదయాన్నే ఆక్వా చెరువుకు వెళ్లే హడావుడిలో వేగంగా వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న లారీని గమనించకుండా రోడ్డు దాటే ప్రయత్నం చేస్తుండగా లారీ ఢీకొని అక్కడిక్కడే చనిపోయారు. హెల్మెట్ లేకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయాడు.

ద్విచక్రవాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న వారిలో యువతే ఎక్కువగా ఉంటున్నారు. అతివేగంతో ఇష్టానుసారంగా రోడ్లపై వెళుతూ ప్రమాదాలు కోరితెచ్చుకొంటున్నారు. అతివేగం అనర్థం అని అధికారులు చెబుతున్నా లెక్కచేయకుండా ప్రాణాలు పోగొట్టుకొంటున్నారు. నేడు ఉమ్మడి పశ్చిమ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల తీరును పరిశీలిస్తే 75 శాతం మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారని పోలీసులు తెలియజేస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

నిడమర్రు, మే 17 (ఆంధ్రజ్యోతి) : నేడు ఆధునిక జీవినంలో ప్రతి ఒక్కరూ ఉరుకులు, పరుగుల జీవనం సాగిస్తున్నారు. ఒత్తిడితో కూడిన ఉద్యోగాలు, టార్గెట్‌తో కూడిన పనివిధానం వల్ల ఉద్యోగులు చాలామంది అనాలోచితంగా ప్రయాణాలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతు న్నారు. ఆఫీసులో ఈ రోజు ఏపని పూర్తి చేయాలనో, బాస్‌కు ఏవిధంగా సమాధానం చెప్పాలనో, ఇంట్లో పని ఒత్తిడితో కూడిన ఆలోచనలతో రోడ్డెక్కుతున్నారు. ఆ ఆలోచనలతోనే రోడ్డుపై ఆలోచిస్తూ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

హెల్మెట్ లేకుంటే ప్రాణాపాయం..

హెల్మెట్ ధరించడం అసౌకర్యంగా, నమోషీగా చాలామంది యువత ఇప్పటికీ ఆలోచిస్తున్నారు. పోలీసుల బాధను భరించలేక హెల్మెట్ కొనక్కోవడం దానిని బండికి తగించుకోవడం, వేగంగా ప్రయాణించడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఓ సర్వే ప్రకారం ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో 75 శాతం మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారని చెబుతున్నాయి. హెల్మెట్ ధరించడం ద్వారా తీవ్ర గాయాలైనప్పటికీ తల భాగం రక్షించబడుతుండడంతో క్షేమంగా బతికి బట్టకడుతున్నారు.

నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం..

రోడ్డు ప్రమాదాలలో రెండో స్థానం సెల్‌ఫోన్ డ్రైవింగ్. హెల్మెట్ పెట్టుకోకపోవడంతో పాటు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాల బారిన పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా హెల్మెట్ పెట్టుకొంటే సెల్‌ఫోన్ మాట్లాడడం కుదరకపోవడం వల్ల హెల్మెట్ లేకుండా ప్రయాణించడంతో ప్రాణాలు కోల్పోతుఉన్నారు.

అవగాహన కల్పిస్తున్న యంత్రాంగం

హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ జిల్లా పోలీస్ యంత్రాంగం ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహదాలరులను ఆపి వారికి అవేర్‌నెస్ కల్పిస్తూనే వారి వద్ద జరిమానాలు వసూలు చేస్తుంది. ఈ జరిమానా భయం వల్ల చాలామంది హెల్మెట్ ధరించడానికి ముందుకు వస్తున్నారు. ఇష్టంలేక పోయినా పోలీసులు భయంలో హెల్మెట్‌లను అలవాటు చేసుకుంటున్నారు.

హెల్మెట్‌తో మెదడు భాగం సేఫ్



ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు ప్రధానంగా ప్రయాణికుల అశ్రద్ధ కనిపిస్తోంది. మానవ శరీరంలో అత్యంత కీలక అవయమైన మెదడును కాపాడుకోవడం కోసం హెల్మెట్‌ను ధరించాలి. హెల్మెట్ ధరించిన తర్వాత క్లిప్‌లు కూడా లాక్ చేసుకోవాలి. లేదంటే పెట్టుకున్న ప్రయోజనం ఉండదు.

డాక్టర్ పుప్పాల మురళీకృష్ణ, ఆర్థోపెడిక్ సర్జన్, టీపీజీ.

హెల్మెట్ ధారణ అలవాటు చేసుకోవాలి



ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించడం అలవాటుగా చేసుకోవాలి. రోడ్డు ప్రమాద సయమంలో మనిషి కింద పడిపోవడంతో మొదట ప్రయాణికుడు తల నేలను తాకుతుంది. మెదడుకు చిన్నదెబ్బ తగిలిన దాని ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. హెల్మెట్ తప్పనిసరిగా ధరించి మీ ప్రాణాలను కాపాడుకోవాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నూతన చట్టం ద్వారా హెల్మెట్ వాడకపోతే వేసే జరిమానాలను తెలియజేస్తున్నాం.

- డి.శ్రావణ్‌కుమార్, డీఎస్పీ, ఏలూరు

కోకో గింజలకు మద్దతు ధర ఇవ్వాలి

దెందులూరు,మే 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కోకో పంటకు కనీసం కేజీ రూ.500 మద్దతు ధర చెల్లించాలని కంపెనీ వారికి ఆదేశించినప్పటికి, మద్దతు ధర ఇవ్వకపోగా కేజీకి రూ. 50 తగ్గించడం చాలా దారుణమని ఏపీ రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సోమవరప్పాడు పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి వద్ద మోండలీజ్ కంపెనీ ఆఫీసు గొడౌన్ వద్ద కోకో రైతు రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.శ్రీనివాస్, కోకో రైతు సంఘం అధ్యక్షుడు బొల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతియుత నిరసన దీక్షకు ఆయన వచ్చి మద్దతు తెలిపి నిరసన దీక్షలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోకో పంట ద్వారా ప్రతి ఏడాది ప్రభుత్వానికి వెయ్యి కోట్ల డాలర్లు సంపాదిస్తున్నప్పటికీ రైతుల పట్ల కోకో కంపెనీలు చాలా చిన్నచూపు చూడడం దుర్మార్గమన్నారు. కోకో పంటను అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు చేయాలని రైతులతో కలిసి డిమాండ్ చేశారు. అనంతరం దెందులూరు తహసీల్దార్ బత్తుల సుమతి, సీఐ వెంకటేశ్వరావు, దెందులూరు ఎస్ఐ శివాజీలకు కోకో రైతుల డిమాండ్‌లను వినతిపత్రం ద్వారా అందించారు. రైతులకు మద్దతు ధర అందించే వరకు కోకో కంపెనీ గొడౌన్‌లో కార్యకలాపాలు నిలుపుదల చేయాలని లేకపోతే.. కంపెనీకి తాళాలు వేస్తామని అధికారులకు రైతులు తెలిపారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశాలతో వారి ప్రతినిధులు, టీడీపీ సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ, పాలడుగు నరసింహరావు, పెదవేగి మండల టీడీపీ అధ్యక్షులు ఈడ్పుగంటి అనిల్, కోకో రైతులకు మద్దతు ప్రకటించారు. కోకో రైతు సంఘం ఉపాధ్యక్షులు పానుగంటి అచ్యుతరావు, పానుగంటి నరేష్, వై.కేశవరావు, కె.ప్రభాకర్‌రెడ్డి, కోనేరు సతీష్, నాలుగు మండలాల కోకో రైతులు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.



సోమవరప్పాడులో మాట్లాడుతున్న ఏపీ రిటైర్డ్ డీజీపీ వెంకటేశ్వరావు

రేపటి నుంచి ఏలూరులో ఇంటర్ స్పాట్ వాల్యూయేషన్

ఏలూరు అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి సంస్కృతం, ఇంగ్లీషు, తెలుగు, హిందీ, గణితం, పౌరశాస్త్రం సబ్జెక్టుల జవాబుపత్రాల మూల్యాంకనాన్ని ఈనెల 19నుంచి ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి స్పాట్ వాల్యూయేషన్ క్యాంపు ఏలూరులో జరుగుతుందని వివరించారు. సంబంధిత సబ్జెక్టుల జవాబుపత్రాల మూల్యాంకనానికి నియమితులైన సీఈలు, ఎగ్జామినర్లు సోమవారం ఉదయం పది గంటలకు, స్క్రూటినైజర్లు 20న ఉదయం పది గంటలకు స్పాట్ క్యాంపు ఆఫీసర్‌వద్ద రిపోర్టు చేయాలని ఆదేశించారు. నియమితులైన సిబ్బందినందరినీ ఆయా కళాశాలలనుంచి స్పాట్ విధుల నిమిత్తం రిలీవ్ చేయాలని కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు.

శ్రీవారి ట్రస్టుకు రూ.5.20 లక్షల విరాళం

ద్వారకాతిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న నిత్యాన్నదాన పథకానికి ఓ దాత కుటుంబం శనివారం రూ.5.20 లక్షలను విరాళంగా అంద జేశారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం టి.తాడిమళ్ల గ్రామానికి చెందిన చింతల మోహన్ వెంకట దొరబాబు ఈ విరాళాన్ని తన కుటుంబ సభ్యుల పేరున ఆ లయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సం దర్భంగా అన్నదాన పర్యవేక్షకులు డీవీఎస్ రాజు దాత కుటుంబానికి విరాళం పత్రాన్ని అందజేశారు. శ్రీవారి దర్శన సౌకర్యాన్ని కల్పించారు.



దాత కుటుంబానికి విరాళం పత్రాన్ని అందిస్తున్న సూపరింటెండెంట్ రాజు

ఆవిరైన పుట్టినరోజు వేడుకల ఆనందం

ఆటోను ఢీకొన్న లారీ.. ఒకరి మృతి.. ఐదుగురికి గాయాలు

నూజివీడు టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి):అప్పటిదాకా పుట్టినరోజు వేడుకల్లో ఆనందంగా గడిపిన యువకులు తిరుగు ప్రయాణంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం బారిన పడ్డారు. నూజివీడులో బర్త్‌డే ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు వెళ్ళిన ఆరుగురు స్నేహితులు నూజివీడు నుంచి ఆటోలో తిరిగి వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న ఆటోను వెంకటాద్రిపురం వద్ద లారీ బలంగా ఢీ కొట్టింది. దీంతో హనుమంతులగూడెంకు చెందిన మంతెన అజయ్‌కుమార్(28) లారీ చక్రాల కింద పడి సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మరో ఐదుగురు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. తీవ్రంగా గాయపడిన యువకులను నూజివీడు ఏరియాఆసుపత్రికి తరలించారు. కాగా గాయపడిన యువకులు శ్రీనివాస్, సాయికిరణ్, ఇమ్రాన్, పవన్,ప్రశాంత్‌లుగా గుర్తించారు.



ప్రమాదంలో చెల్లాచెదురుగా పడిపోయిన యువకులు

తుని రోడ్డు ప్రమాదంలో తణుకు, పోలవరం వాసుల దుర్మరణం



హజరత్ అలీ(ఫైల్)

పోలవరం, మే 17(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా తుని సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఒకరు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన వ్యక్తి కాగా మిగతా ఇద్దరు పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు చెందిన వారాడ సుధీర్ (36), ఏలూరు జిల్లా పోలవరం గ్రామానికి చెందిన హజరత్ అలీ (32) దుర్మరణం పాలయ్యారు. వీరు రాజమండ్రి అపోలో ఫార్మసీలో పని చేస్తున్నారు. అలీకి 15 నెలల క్రితం వివాహమై 6 నెలల పాప ఉన్నది. అలీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పోలవరం బీసీ కాలనీలో అతని నివాసం వద్ద కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. పోలవరంలో విషాదచాయలు అలుముకున్నాయి. బాధితులు విజయనగరంలో కంపెనీ మీటింగుకి వెళ్ళి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది.

టాస్కుల పేరుతో ఆన్‌లైన్ మోసం

నరసాపురం టౌన్, మే 17: పట్టణంలోని 8వ వార్డుకు చెందిన వివాహిత ఆన్‌లైన్‌లో టాస్కులు పేరుతో రూ. 10లక్షలు మోస పోయింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై జయలక్ష్మి వివరాల ప్రకారం ఇన్‌స్టాగ్రాంలో ఇంట్లో ఉంటూ ఉద్యోగం చేసుకుని సంపాదించవచ్చంటూ అనే రీల్‌ను చూసిందన్నారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు అందులో ఇచ్చిన నెంబర్‌కు ఫోన్ చేసింది. వాళ్లు జాబ్ పేరుతో కొన్ని టాస్కులు పెట్టారు. మేము పెట్టిన పోస్టుకు మీరు లైక్‌లు కొట్టాలని ఇలా కొట్టిన వెంటనే డబ్బులు వస్తాయని నమ్మించారు. ఇందుకు కొంత మొత్తం ముందుగా కట్టాలని చెప్పారు. ఇది నిజమని బాధితురాలు వారు పంపించిన యూపీఏ నెంబర్‌కు రూ.10లక్షలు కట్టింది. టాస్కులు పూర్తి చేస్తున్నా డబ్బులు రాకపోవడంతో బాధితురాలికు అనుమానం వచ్చి నిలదీశారు. మీ సొమ్ము తిరిగి ఇవ్వాలంటే మరో రూ.10లక్షలు చెల్లించాల్సి ఉంటుందని ఇంకా నమ్మించే ప్రయత్నం చేశారు. చివరికి తాను మోసపోయానని బాధితురాలు పోలీసుల్ని ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయలక్ష్మి తెలిపారు.

ముగ్గురిపై పోక్సో కేసు నమోదు

భీమవరం క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు యువకులపై పోక్సో కేసు నమోదైంది. భీమవరం టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ తెలిపిన వివరాల ప్రకారం కాళ్ళ మండలంలో ఒక గ్రామానికి చెందిన యువతి (18)ని అదే గ్రామానికి చెందిన బందెల సాలేము ప్రేమిస్తున్నానంటూ వెంటపడి లొంగదీసుకున్నాడు. అనంతరం ఫొటోలు, వీడియోలు తీశాడు. కొంత కాలం తర్వాత ఆ యువతికి గర్భం రావడంతో వివాహం చేసుకోమని కోరింది. వివాహం చేసుకోనని, ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే ఫొటోలు, వీడియోలు బయటపెడతానంటూ బెదిరించాడు. ఇదిలా ఉండగా సాలేము స్నేహితుడు మోర్తా బాలు కూడా ఫొటోలు, వీడియోలు బయట పెడతానంటూ బ్లాక్‌మెయిల్ చేసి లొంగదీసుకున్నాడు. దీంతో యువతి తల్లిదండ్రులకు విషయం చెప్పి శుక్రవారం రాత్రి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బందెల సాలేము, మోర్తా బాలును, సాలేముకు సహకరించిన ప్రవీణ్‌లపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లాకర్‌లో బంగారం మాయం

పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు



బ్యాంకు మేనేజర్‌ను విచారిస్తున్న ఎస్ఐ నాగరాజు

ఆకివీడు, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు గ్రామీణ బ్యాంకు లాకర్‌లో దాచుకున్న కొంత బంగారంలో 27 కాసులు మాయమైనట్లు బాధితురాలు వల్లభనేని శ్రీపూర్ణలక్ష్మి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనితో ఎస్ఐ నాగరాజు మేనేజర్‌ను శనివారం విచారించి మీడియాతో మాట్లాడారు. గత ఏప్రిల్ 9న బ్యాంకు లాకర్‌లో బంగారం దాచుకున్నారని, ఈ నెల 15న బంగారం నగలు తీసుకోవడానికి ఆమె వెళ్ళిందన్నారు. అయితే 27కాసుల నగలు మాయమైనట్లు అనుమానం రావడంతో మేనేజర్‌ను ప్రశ్నించగా తాళం మీ దగ్గరే ఉంటుందని తమకు తెలియదని తెలపడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఎస్ఐ, మేనేజర్ సీసీ కెమెరాలు పరిశీలించారు. బాధితురాలిని ప్రశ్నించగా లాకర్ తెరిచే సరికి బాక్సు వంకరై ఉందని, తన బంగారం 27 కాసులు మాయమైందని చెబుతున్నారు. విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

అత్త నోట్లో పురుగుల మందు పోసిన అల్లుడు

ఏలూరు క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి) : తన కుమార్తెను ఎందుకు కొడుతున్నావంటూ అల్లుడిని మందలించడంతో ఆగ్రహించిన అల్లుడు పురుగుమందు తెచ్చి అత్తనోట్లో పోశాడు. దీంతో ఆమె ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతుంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు నల్లదిబ్బ ప్రాంతానికి సజ్జా వెంకట లక్ష్మి తనకుమార్తెను రాజేష్‌కు ఇచ్చి వివాహం చేసింది. కుమార్తెను కొట్టడంతో వెంకట లక్ష్మి తన అల్లుడు అయిన రాజేష్‌ను ప్రశ్నించింది. ఆగ్రహించిన అతను పురుగు మందు తెచ్చి ఆమె నోట్లో పోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న రాజేష్ కోసం గాలింపు చేపట్టారు.

పాడిగేదెలు చోరీ

పెదవేగి, మే 17(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం గార్లమడుగు గ్రామానికి చెందిన పర్వతనేని వీరవెంకట సత్యవరప్రసాద్‌కు చెందిన రెండు పాడిగేదెలు చోరీకి గురయ్యాయి. పొలంలో కట్టేసిన ఆ పాడి గేదెలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని బాధిత రైతు పెద వేగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితరైతు వీరవెంకట సత్యవరప్రసాద్ మాట్లాడుతూ ఆరునెలల క్రితం రూ.2.50 లక్షలతో రావులపాలెం నుంచి రెండు గేదెలను కొనుగోలు చేసి తీసుకొచ్చామ న్నారు. కాగా రెండు నెలల క్రితం దానిలో ఒక గేదెను రాత్రి సమయంలో ఎత్తుకు పోయారని, ఇప్పుడు మిగిలిన రెండో గేదెను ఎత్తుకుపోయారని బాధిత రైతు ఆవేదనగా చెప్పారు. మొదటి గేదెను ఎత్తుకుపోయిన ప్పుడు పోలీస్ కేసు పెట్టామని, ఇప్పుడు కూడా ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు. పశువులను గ్రామం సమీపంలోనే పొలాల్లో కట్టి ఉంచుతామని, రాత్రి సమ యంలో ట్రక్కు, ఆటోల్లో వచ్చి పశువులను అపహరించుకుపోతున్నారని రైతులు పేర్కొంటున్నారు.

బంగారం దుకాణంలో గుమస్తా చోరీ ?

భీమవరం క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఒక బంగారం దుకాణంలో అందులో పని చేస్తున్న గుమస్తా సుమారు రూ. 30 లక్షల విలువైన బంగారాన్ని దోచుకున్నాడన్న ప్రచారం పెద్ద ఎత్తున సాగుతున్నది. చోరీకి గురైన మరుసటి రోజు యజమానికి అనుమానం రావడంతో సీసీ కెమెరాలు తనిఖీ చేయగా ఈ విషయం బట్టబయలైంది. దాంతోపాటుగా గతం నుంచి కూడా ఆ గుమస్తా చోరీ చేస్తున్నాడన్న విషయం సీసీ కెమెరాల్లో తేలినట్లుగా అందరూ చెబుతున్నారు. దీనిపై వన్‌టౌన్ పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో పురోగతి

బ్యాంకు ఖాతాల పరిశీలన

కోట్లలో లావాదేవీలు

పాలకొల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): ఆన్ లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వైసీపీ నేతలు మండెల వెంకటరావు, వై.వెంకటమురళిపై గత నెల 20న పోలీసులు నమోదు చేసిన కేసులో జిల్లా పోలీసులు పురోగతి సాధించారు. ఇదే కేసులో ఉమ్మడిజిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీతో పాటు ఆయన సోదరుడు యడ్ల నాగేశ్వరరావు లను ఈ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన బెట్టింగ్ నిర్వాహకులుగా గుర్తించారు. ఈకేసులో మొత్తం 10మందిని గుర్తించగా ఏ1గా మండెలా వెంకటరావు, ఏ2గా వై.వెంకటమురళి ఉన్నారు. వీరిని అరెస్టు చేయగా ఏ4గా ఉన్న యడ్ల తాతాజీ, ఏ3గా ఉన్న యడ్ల నాగేశ్వరరావులను అరెస్టు చేసే క్రమంలో పరారీ అయ్యి కోర్టు ఆర్డరు తెచ్చుకున్న తర్వాత వీరు పోలీసులకు లొంగిపోయారు. వీరి ఫోన్లలోని డేటాను, ఉపయోగించిన వెబ్‌సైట్‌కు సంబంధించిన డేటాను రాబట్టేందుకు ఫోరెన్సిక్ సైన్సు లేబొరేటరీకు పంపిస్తున్నారు. వీరి నలుగురి బ్యాంకు లావాదేవీలను పరిశీలించగా రూ.23 కోట్లు అక్రమ లావాదేవీలు, అవి కాకుండా యడ్ల తాతాజీ, యడ్ల నాగేశ్వరరావు వారి బంధువుల పేరిట 42 ఆస్తులు గుర్తించారు. లక్ష్మీ ఫిల్లింగ్ స్టేషన్ ద్వారా నిధులను, బెట్టింగ్ సొమ్ములను చలామణిలోకి తీసుకొచ్చే క్రమంలో అనుమానం వ్యక్తమవడంతో ఆదాయపు పన్ను శాఖ పరిశీలిస్తోంది. సంబంధిత బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడానికి ఇప్పటికే ఆయా బ్యాంకులకు లేఖలను పంపించారు. ఏ3, ఏ4 లకు ఎటువంటి ఉద్యోగం లేదని, ఒకవేళ ఏదైనా వ్యాపారాలు చేస్తున్నట్టయితే వాటిపై వచ్చిన ఆదాయంతోనే ఆస్తులు కూడబెట్టారా, బెట్టింగ్‌ల ద్వారా వచ్చాయా అనే విషయాలు తెలియాల్సి ఉంది. 42ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి సేకరించారు.

మోటార్ సైక్లిస్టు మృతి

కొయ్యలగూడెం, మే17 (ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో జంగారెడ్డిగూడెంకు చెందిన వేములపూడి సత్యనారాయణ (37) మృతి చెందాడు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు మృతుడు సత్యనారాయణ శనివారం ఉదయం కొయ్యలగూడెం నుంచి జంగారెడ్డి గూడెం వైపు వెళ్తుండగా బయ్యన్నగూడెం ఇటుకల బట్టి వద్దకు వచ్చేసరికి మోటార్‌సైకిల్ అదుపు తప్పి పడిపోయాడు. దీంతో మృతుడికి తీవ్రగాయాలయ్యాయి. మృతుడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు.

నేడు తిరంగా యాత్ర

నరసాపురం టౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయం సాధించడంపై ఆదివారం పట్టణంలో భారీ ఎత్తున తిరంగా యాత్ర నిర్వహించనున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పాటు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ తెలిపారు. విప్ నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు పాల్గొంటారని, పార్టీలకతీతంగా జరిగే ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

మొగల్తూరు, మే 17(ఆంధ్రజ్యోతి): మొగల్తూరులో సీతారామ మెడికల్ స్టోర్స్ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రొప్రయిటర్ సంకా సోమరాజు తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉదయం 8 నుంచి శిబిరాన్ని ప్రారంభిస్తున్నామని గుండె, ఊపిరితిత్తులు, చిన్న పిల్లలు, స్త్రీల వ్యాధులు, ఎముకలు, కీళ్లు, చర్మ వ్యాధులకు కార్పొరేట్ ఆసుపత్రుల వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ

గణపవరం, మే 17(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశాలకు అధికారులు గైర్హాజరవడం పట్ల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గణపవరం మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ దండు వెంకటరామరాజు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఇరిగేషన్, డ్రైనేజీ, ఆర్‌అండ్‌బీ తదితర ప్రధాన శాఖల అధికారులు గైర్హాజరయ్యారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ మండల స్థాయి అధికారు లంతా సమావేశాలకు పూర్తిస్థాయిలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వ్యవసాయాధికారి వైవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ అన్నదాతా సుఖీభవ పథకం కింద వరి రైతులకు జూన్‌లో రూ.20వేలు మూడు దఫాలుగా జమ అవుతాయన్నారు. ఎంపీడీఓ బేబి శ్రీలక్ష్మి, పంచాయతీరాజ్ డీఈ స్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి


మెరైన్ ఎస్‌ఐ సోమశేఖరరెడ్డి పల్లెనిద్ర

మొగల్తూరు, మే 17(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు, గ్రామస్థులు అపరిచిత వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అనుమానితులపై పోలీసులకు సమాచారం అందించాలని మెరైన్ స్టేషన్ ఎస్‌ఐ సోమశేఖరరెడ్డి సూచించారు. అంతర్వేదిలోని మెరైన్ స్టేషన్ ఎస్‌ఐ సోమశేఖరరెడ్డి శుక్రవారం రాత్రి కేపీ పాలెం గ్రామంలో పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్ టెర్ర రిస్టులు సముద్రమార్గం గుండా దేశంలో ప్రవేశించే వీలులేకుండా తీర ప్రాంతంలో భారత ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టిందన్నారు. అనుమానితులు తారస పడినా, మాదకద్రవ్యాల రవాణా జరుగుతున్నట్టు గుర్తించినా 1093కి సమాచారం అందించాలన్నారు.

తణుకు సబ్ జైలును సందర్శించిన జిల్లా జడ్జి



తణుకు, మే 17(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. శనివారం తణుకులోని సబ్ జైలును సందర్శించారు. జైలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం, సేవలు గురించి వివరించారు. ఎవరైనా న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేకపోతే మండల న్యాయసేవల సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. న్యాయాధికారులు కె. కృష్ణవేణి, తాడి ఆంజనేయులు, న్యాయవాదులు శివకుమార్ సత్యనారాయణరాజు, జైలు సూపరింటెండెంట్ మోహనరావు పాల్గొన్నారు.



మద్యపాన రహిత సమాజమే ధ్యేయం

భీమవరం క్రైం, మే 17(ఆంధ్ర జ్యోతి): మద్యపాన రహిత సమాజమే ప్రభుత్వ ధ్యేయమని భీమవరం ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక, భీమవరం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ముఠా కూలీలతో మద్యపాన వ్యసనం- జీవితం నాశనం నినాదంతో ఎక్సైజ్ డీఎస్పీ కుమారన్ ఆదేశాల అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. రంగసాయి, తటవర్తి భాస్కరరావు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ టెక్నాలజీదే కీలక పాత్ర

భీమవరం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): దేశాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్ళడంలో డిజిటల్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని టెలిఫోన్ జేటీవో పులి సాయిబాబా అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భీమవరం ఎడ్వర్డ్ ట్యాంక్ వద్ద బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ కార్యాలయంలో ప్రపంచ టెలికాం దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ పురాతన, ఆధునిక టెలిఫోన్స్ చిత్రపటాల ప్రదర్శన నిర్వహించారు. న్యాయవాది ఉండపల్లి రమేష్‌నాయుడు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కొండ్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



ఉండి, మే17(ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో ఉపాధి కూలీల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు మంతెన సీతారాం పూలమాల వేసి నివాళులర్పించారు. సంపన్న కుటుంబంలో జన్మించి కార్మికుల సంక్షేమం, వారి హక్కుల కోసం పాటుపడిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. దనికొండ శ్రీనివాస్, వాసుదేవరావు, వైకుంఠరావు, అన్నవరం, వ్యవసాయ కూలీలు తదితరులు పాల్గొన్నారు.


కూలీల మధ్య కేక్ కట్ చేస్తున్న కోడి విజయభాస్కర్ దంపతులు

కూలీల మధ్య ఏఎంసీ చైర్మన్ పెళ్లిరోజు వేడుకలు

పాలకొల్లు రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు ఏఎంసీ చైర్మన్, మాజీ జడ్పీటీసీ కోడి విజయభాస్కర్, విజయలక్ష్మి దంపతులు పెళ్లిరోజు వేడుకలు సగంచెర్వు గ్రామంలో శనివారం ఉపాధి కూలీల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు 129 మందికి భోజనాలను దంపతులిద్దరూ స్వయంగా వడ్డించారు. కూలీలు మధ్య పెళ్లిరోజు జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, కూటమి నాయకులు, బందుమిత్రులు విజయభాస్కర్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

భగవద్గీత శ్లోకాల కంఠస్థంలో రాధాకుమారి ప్రతిభ



ఉండి, మే 17(ఆంధ్రజ్యోతి): గణపతి సచ్చిదానంద స్వామిజీ చేతుల మీదుగా బంగారు పతకం అందుకోవడం మరపురానిదని యండగండికి చెందిన వాసవి క్లబ్ కార్యదర్శి మాటూరి భాస్కరగుప్తా కుమార్తె కంచర్ల రాధాకుమారి అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. భగవద్గీతలోని 18 అధ్యాయాల్లో సుమారు 700 శ్లోకాలుండగా ఆ శ్లోకాలను చూడకుండా చెప్పేస్తానని తెలిపారు. ఆ విధంగా చెప్పే శక్తిసామర్థ్యాలున్న వారికి దత్తపీఠం ఆహ్వానించి బంగారు పతకం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ మేరకు తాను పతకం అందుకున్నానని తెలిపారు.


తణుకులో అధికారులతో కలసి ఆరిమిల్లి ప్రతిజ్ఞ


తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి, బాబ్జి ప్రతిన


నరసాపురంలో మొక్కలు నాటుతున్న ఆర్డీవో


కాళ్ల సబ్ స్టేషన్‌లో విద్యుత్ సిబ్బంది ప్రతిన


పాలకోడేరు పీహెచ్‌సీ వద్ద వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ


పిప్పర ప్రభుత్వ వైద్యాధికారి ప్రియాంక ఆధ్వర్యంలో గొడుగులతో ర్యాలీ

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సాధించాలి

కార్యక్రమాల్లో వక్తలు.. ర్యాలీలు.. ప్రతిజ్ఞలు

తణుకు, మే 17(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. శనివారం జిల్లా నోడల్ అధికారి సూర్యకుమారితో కలసి పట్టణంలోని 6, 7 వార్డుల్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరో వార్డులో చెర్వులో తూడును డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంతో మందు పిచికారీ చేసినట్టు చెప్పారు. చెర్వు చుట్టూ రిటైనింగ్ వాల్, వాకింగ్ ట్రాకు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. జిల్లా నోడల్ అధికారి సూర్యకుమారి మాట్లాడుతూ చెరువులు, పంట కాలువల్లో వ్యర్థాలు వేయకుండా సహకరించాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. రోడ్ల పక్క చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డుల ందించారు. పారిశుధ్య కార్మికులను సత్కరించారు. జేసీ రాహల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో ఖానో, మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, భవన, ఇతర కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. తొలుత వలవల బాబ్జితో పాటు టైలరింగ్ అసోసియేషన్ చైర్మన్‌గా ఎంపికైన ఆకాశపు స్వామిని ఎమ్మెల్యే బొలిశెట్టి సత్కరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు ప్రతిజ్ఞ చేయించారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, వర్తనపల్లి కాశి, అడబాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర సాధ్యమని తాడేపల్లిగూడెం ఎంపీడీవో ఎం. విశ్వనాథ్ పేర్కొన్నారు. మిలిటరీ మాధవరంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ సూర్యకు మారి, ఉపసర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు. అనంతరం ఉపాధి కూలీలతో ప్రతిజ్ఞ చేయించి వారికి ఓఆర్ఎస్ పంపిణీ చేసి చలివేంద్రంలో మజ్జిగ అందించి సచివాలయం వద్ద కొబ్బరి మొక్కలు నాటారు. కార్యదర్శి బి ఫణికుమార్, ఎంఆర్‌సీ ఎం. రవికిరణ్, మాజీ సర్పంచ్ కౌలూరి పరిమళ, టీడీపీ నాయకుడు సూరిశెట్టి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాళ్ళ: స్వచ్ఛాంధ్రకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎలక్ట్రికల్ ఏఈ పి.రాంబాబు అన్నారు. శనివారం కాళ్ల సబ్ స్టేషన్ పరిసరాల్లో ఉన్న చెత్త, ప్లాస్టిక్‌ను సిబ్బందితో కలసి తొలగించారు. అనంతరం సిబ్బందితో కలసి ర్యాలీ, నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

పాలకోడేరు: పాలకోడేరు మండలంలో పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలోను, గొరగనమూడి గ్రామ వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలోను కార్యక్రమం నిర్వహించారు. పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రంగంనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రత పాటించాలన్నారు. వైద్యాధికారి స్వర్ణ నిరంజని, సీహెచ్‌వో సత్యనారాయణ, పీహెచ్ఎన్ కుమారి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. గొరగనమూడిలో వీపీవో సరళ, హెల్త్ అసిస్టెంట్ విజయ్‌ప్రసాద్, ఏఎన్ఎంలు సుజాత, వేదకుమారి, ఆశా కార్యకర్త శాంతి పాల్గొన్నారు.

గణపవరం: పిప్పరలో ప్రభుత్వ వైద్యాధికారి ప్రియాంక ఆధ్వర్యంలో గొడుగులతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు. గణపవరంలో సర్పంచ్ మూరా అలంకారం ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శి శివరామ్‌ప్రసాద్, కూటమి నాయకులతో కలిసి మొక్కలు నాటారు. సరిపల్లెలో చలివేంద్రాన్ని ఎంపీడీఓ బేబి శ్రీలక్ష్మి, సర్పంచ్ లక్ష్మీ భవాని, కార్యదర్శి రామాంజనేయులు ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

ఆచంట: ఎండా కాలం దృష్ట్యా ప్రజలంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ జి. కనకరాజు, ఎంపీడీవో వి. పూర్ణబాబ్జి అన్నారు. ఎండ నుంచి ఉపశమనంపై ఫ్లెక్సీలతో ప్రదర్శన చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వరరావు, ఆర్‌ఐ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నాగబాబు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణను విద్యార్థులతో కలసి అధ్యాపకులు, ప్రిన్సిపాల్, సిబ్బంది శుభ్రం చేశారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజరాజేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీట్ ద హీట్ అంశంపై ఆన్‌లైన్‌లో క్విజ్‌ను నిర్వహించారు. శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో ఆలయం, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరిండెంటెంట్ పసుపులేటి వాసు పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఆర్డీవో దాసిరాజు అన్నారు. రుస్తుంబాదాలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రంగా ఉన్నప్పుడే స్వచ్ఛత సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం చలివేంద్రాన్ని ప్రారంభించారు. పంచాయతీ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. ఎంపీడీవో రామకృష్ణంరాజు, తహసీల్దార్ సత్యనారాయణ, సర్పంచ్ బందెల బారతి, యడ్లపల్లి కాశీ అన్నపూర్ణేశ్వరి, కార్యదర్శి ఫణికర్, రవీంద్ర పాల్గొన్నారు.

మొగల్తూరు: అన్ని పంచాయతీల పరిధిలో పారిశుధ్య కార్యక్రమాలపై ర్యాలీ నిర్వహించారు. కొత్తోటలో సర్పంచ్ పడవల సత్యనారాయణ, తహసీల్దార్ రాజ్ కిషోర్, ఎంపీడీవో త్రిశూల పాణి, ఈవోఆర్డీ నవీన్ కిరణ్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, చలివేంద్రంలో సేవలందించారు.

1053 రకం ధాన్యాన్ని తీసుకోని మిల్లర్లపై చర్యలు : జేసీ

పోడూరు, మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో లక్ష్యానికి మించి ధాన్యం సేకరణ జరిగిందనీ, రైతులు దగ్గర ఉన్న ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. శనివారం పెనుమదంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, రైస్ మిల్లులను సందర్శించి మాట్లాడుతూ త్వరితగతిన ధాన్యం సేకరణను పూర్తిచేయాలని సూచించారు. దాళ్వాలో 1021, 1056, 1053 వరి రకాలు పండించామనీ అయితే 1053 రకం మిల్లర్లు తీసుకోవడం లేదని, దీంతో మిల్లులు బయటే ధాన్యం ట్రాక్టర్ లోడులు ఉండిపోయాయని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రకం ధాన్యాన్ని తీసుకోని మిల్లర్లపై చర్యలు తప్పవన్నారు. పోడూరు, ఆచంట తహసీల్దార్లు ఏఎస్ఎం ఫాజిల్, వి.కనకరాజు, ఏవో జి.సత్యనారాయణ, ఆర్ఐ రాంబాబు, పౌర సరఫరాల డీటీ నాగదేవి జేసీ వెంట ఉన్నారు.



'ఇందుకూరి'కి 'గన్ని' అభినందన

గణపవరం, మే17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని అప్కాబ్ చైర్మన్, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు కోరారు. గణపవరం మండల టీడీపీ నూతన అధ్యక్షుడిగా రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ ఇందుకూరి రామకృష్ణంరాజు ఎన్నికయ్యారు. శనివారం పిప్పర పార్టీ కార్యాలయంలో ఆయనను అభినందిస్తూ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అడ్డేపల్లి వాసురాజు, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ల సుబ్బారావు, మండల అధికార ప్రతినిధి కూనసాని నాగేశ్వరరావు, గణపవరం పట్టణ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, తెలుగు యువత అధ్యక్షుడు చిన్న, మొయ్యేరు టీడీపీ అధ్యక్షుడు చంటి, జల్లికాకినాడ టీడీపీ అధ్యక్షుడు దండు బాబ్జీరాజు తదితరులు ఇందుకూరిని అభినందించారు.


కొడమంచిలి- వల్లూరు కాలువ పూడికతీత పనులు ప్రారంభిస్తున్న పితాని వెంకట్

పూడికతీత పనులు ప్రారంభించిన పితాని వెంకట్

ఆచంట, మే 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆదేశాల మేరకు కొడమంచిలి, వల్లూరు కాలువ పూడికతీత పనులను శనివారం ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్ పనులు ప్రారంభించారు. నీటి సంఘం అధ్యక్షులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

కాలువల పనులకు రూ.344 కోట్లు మంజూరు: నిమ్మల


పూలపల్లిలో డ్రెయిన్ తవ్వకం పనులకు శంకుస్థాపన మంత్రి రామానాయుడు

పాలకొల్లు రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంట కాలువలు, మురుగు డ్రైన్ల నిర్వహణ, మరమ్మతు పనులకు రూ.344 కోట్లను సీఎం చంద్రబాబునాయుడు మంజూరు చేశారని రాష్ట్ర జల వనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలం పూలపల్లి, ఆగర్రు గ్రామాల పరిధిలో రూ.1.88 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శనివారం కూటమి నాయకులతో కలిసి మంత్రి నిమ్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెలాకరుకు కాలువలు, డ్రెయిన్ల మరమ్మతు పనులు పూర్తిచేసి రైతులకు ఉపయోగపడేలా వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. గత ఐదేళ్లలో రైతాంగానికి సంబంధించిన పనులు ఏ ఒక్కటీ చేపట్టలేదనీ దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పుడు రైతు ప్రభుత్వంగా పనిచేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, మాజీ చైర్మన్ గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, కృష్ణాజిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ ఉన్నమట్ల కబర్ధి, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరు నాయుడు, జనసేన ప్రచార విభాగం జిల్లా కన్వీనర్ తులా రామలింగేశ్వరరావు, నాయకులు వేగేశ్న శ్రీహరిరాజు, గుబ్బల హరిప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి చేరికలు..



పెంటపాడు, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రజాశ్రేయస్సు కోసమే కూటమి ప్రభుత్వం ఏర్పడిందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జట్లపాలేనికి చెందిన వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టుబోయిన కృష్ణప్రసాద్, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, మాజీ సర్పంచ్ కట్టుబోయిన భాస్కరరావు, మాజీ ఎంపీటీసీ గుమ్మళ్ళ రత్నంరాజు శనివారం ఎమ్మెల్యే బొలిశెట్టి సమక్షంలో జనసేనలో చేరగా ఎమ్మెల్యే బొలిశెట్టి వారికి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. పుల్లా బాబి, కసిరెడ్డి మధులత, షైలవరపు పెదబాబు, బండి పెద్దిరాజు, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, పాలూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అన్నదానం మిన్న: అంజిబాబు

భీమవరం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కెల్లా అన్నదానం గొప్పదని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం జెపి రోడ్డులోని శ్రీ పద్మావతి వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామివారి వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలు ముగింపులో భాగంగా శనివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఇవో ముదునూరి సత్యనారాయణరాజు, చైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు స్వామివారికి మహా నివేదన చేశారు.

కాళ్ళ: కాళ్ళకూరులో శ్రీ వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం అఖండ అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి అనంతరం భక్తులకు ప్రసాదాన్ని అందించారు. ఈవో ఎం.అరుణ్‌కుమార్ పర్యవేక్షించారు.



బాబ్జికి బీజేపీ నాయకుల అభినందన

తాడేపల్లిగూడెం అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జికి, ఏపీ భవన, ఇతర కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ పదవి వచ్చిన సందర్భంగా శనివారం స్థానిక టీడీపీ కార్యాలయం వ ద్ద కూటమి నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. పెంటపాడు మండలం రావిపాడు, బీ.కొండేపాడు తదితర గ్రామాల టీడీపీ నాయకులతో పాటు, పట్టణంలోని బీజేపీ శ్రేణులు బాబ్జిని సత్కరించారు.



నాగేంద్ర కుటుంబానికి బొలిశెట్టి చేయూత

తాడేపల్లిగూడెం అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): గంధం నాగేంద్ర మృతి బాధాకరమని ఎమ్మెల్యే బొలిశెట్టి విచారం వ్యక్తం చేశారు. పట్టణంలోని సవిత్రుపేటకు చెందిన జనసైనికుడు గంధం నాగేంద్ర వడ దెబ్బ కారణంగా మృతి చెందడంతో శనివారం ఎమ్మెల్యే మృతుని కుటుంబీకులకు తన సొంత నిధులు రూ 1.50 లక్షలు అందజేశారు. తాను అండగా ఉంటానన్నారు.



అ'పూర్వ' కలయిక

యలమంచిలి, మే 17 (ఆంధ్రజ్యోతి): మేడపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2010-11 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం జరిగింది. ఆత్మీయంగా అప్పటి నిక్ నేమ్‌లతో పలకరించుకుంటూ ఆడి, పాడి సందడి చేశారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి రూ.20వేలు అందజేశారు. సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముద్దల స్వాతి, కె.శ్రీదుర్గాదేవి, ప్రసన్న, మనోజ్, రాజేష్, శివాజి తదితరులు పాల్గొన్నారు.

రేపు సారవ ఉప సర్పంచ్ ఎన్నిక

నరసాపురం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సారవ గ్రామంలో సోమవారం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల ఆధికారి, ఈవోపీఆర్డీ జెవీడీ ప్రసాద్ తెలిపారు. ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయం వద్ద ఈ ఎన్నిక జరుగుతుందన్నారు. ఎన్నిక ఏకగ్రీవం అయితే ఉప సర్పంచ్‌ను వార్డు సభ్యుల్లో ఒకరు ప్రతిపాదిస్తే మరొకరు బలపరుస్తారన్నారు. అదే పోటీ ఉంటే సభ్యులు చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహిస్తామన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తుతో పాటు ఎన్నిక సజావుగా సాగేందుకు అధికారులు ఏర్పాట్లను చేయనున్నట్లు ఎన్నికల ఆధికారి తెలిపారు.

రక్తపోటును నియంత్రించుకోవాలి

పెనుమంట్ర, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచ హైపర్ టెన్షన్‌డే సందర్భంగా జిల్లాలోని పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. రక్తపోటును నియంత్రించు ఆరోగ్యాన్ని పరిరక్షించు నినాదంతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి గీతాబాయి మాట్లాడుతూ ఎండకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనలక్ష్మి, సుభాష్, డాక్టర్ కనక ప్రియ, అధికారులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి వసుధా సాయం

పాలకొల్లు అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): రెండు కిడ్నీలు పాడె డయాలసిస్ చేయించుకుంటున్న మొగల్తూరు మండలం కోమటి తిప్ప గ్రామానికి చెందిన ఈమన సత్య సూర్యప్రసాద్ అనే యువకుడికి వసుధా ఫౌండేషన్ ద్వారా శనివారం రూ. 10వేలు ఆర్థిక సహాయం అందించినట్లు ఏరియా కన్వీనర్ పెన్మెత్స బుద్దరాజు తెలిపారు.

కూలీల చేతిలో పాము హతం

తాడేపల్లిగూడెం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): మాదవరంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు తెల్లపొడ పాము కనిపించడంతో వారు భయాందోళనలు వ్యక్తం చేశారు. దానిని దారి మళ్లిస్తున్నా మీదిమీదికి రావడంతో కూలీలు దానిని హతమార్చారు. కూలీలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సూచించారు.

వేసవి శిక్షణ

తణుకు రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): వేల్పూరు గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, ఇంగ్లీష్ వ్యాకరణం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రిసోర్సు పర్సన్ రుద్రయ్య, కోరా సత్యనారాయణ పాల్గొన్నారు.